# సారేజహాసే అచ్ఛా

బండరాళ్ళ లాంటి టెక్స్ట్ బుక్స్. పీడ కల ల్లాంటి పరీక్షలు. దయలేని దేవరకు చేసే కొలువు లాంటి వార్డు డ్యూటీలు – ఇదీ మామూలుగా మెడికల్ కాలేజీ లైఫ్. ప్రిన్సిపాల్ ఎలక్షన్స్ డేటు ప్రకటించినప్పటి నుంచి కాలేజీ వాతావరణమే మారిపోయింది. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ ఇవ్వబడ్డ ఎనీమియా పేషంటులా 'క్యాంపస్'లో జీవ కళ వచ్చింది.

ఎక్కడ చూసినా కోలాహలం,ఉత్సాహం, తమ అంతర్ బహిర్ శక్తులనన్నిటినీ అందు కోసమే దాచి వుంచినట్లుగా! ఈ క్షణం కోసమే ఎదురు చూస్తున్నట్లుగా క్యాంపస్‌లో ఎటు చూసినా చైతన్యవంతమైన సమూహాలు. అక్షర సన్యాసం చేసి స్టూడెంట్స్ అంతా వీధిన బడ్డారు. ఒక చోట ఆశయాల గురించిన ఊకదంపుడు. మరోచోట చెవుల్లోని టింపానిక్ పొరలు పగిలేలా నినాదాల శబ్ద కాలుష్యం. ఔత్సాహిక చిత్రకారులకు ఊపిరి సలపని పని. గోడల నిండా ప్రకటనలే. నామినేషన్లు దాఖలు చేసిన వాళ్ళలో చివరి దాకా నిలిచింది రెండు గ్రూపులు. ఆనందమూర్తి అండ్ కో ఒక గ్రూప్, రాఘవ రావు అండ్ పార్టీ మరో గ్రూపు. పోటీ ఈ రెండు గ్రూపుల మధ్యే.

ఫ్రెషర్స్ వచ్చి రెండు వారాలే అయింది. మొదటిసారి కీకారణ్యంలో అడుగుపెట్టి ఎటు వైపు వెళ్ళాలో, ఎటువైపు వెళ్ళకూడదో తెలియక తత్తర పడుతున్న మేక పిల్లల్లా కంగారుగా వున్నారు వాళ్ళు. ఒకవైపు రాగింగ్. రెండో వైపు ఎలక్షన్ ప్రచారము. మామూలుగా రాగింగ్ సిగ్గును, బాధను, కోపాన్ని ఏక కాలంలో కలిగించే అనుభవము. మనం తొడుక్కునే సంస్కారపు చొక్కా చాటున పురాపు రా సౌహృదాల చాటున అణిగి వున్న అగ్లీనెస్‌ను, ఎరోటిజాన్ని ఎక్స్‌ప్లోర్ చేసి తద్వారా క్రియేట్ అయ్యే ఉద్వేగాల్ని, అలజడిని ఎంజాయ్ చేసే శాడిస్టిక్ ప్రక్రియ రాగింగ్. ''నువ్వు బూతులు మాట్లాడగలవా?' 'ఏదీ ఒక నిముషం పాటు నాన్ స్టాప్‌గా బూతులు మాట్లాడు!' 'ఆడపిల్లలకు కన్ను కొట్టగలవా?' 'పోయి ఆ ఫైనలియర్ పిల్లకు కన్ను కొట్టిరా!' 'ఇంటర్ కోర్సు ఎక్కడ చదివావు?' 'సమరం గారి పేరుగుదువా?' 'ఆయన ప్రశ్నల జవాబుల శీర్షికలో నీ పేరు చూశానే!' 'పి.ఎం.ఐ. అంటే ఏమిటి?' ఈ ఆటవిక ఆనందానికి జాలి, హ్యూమన్ డిగ్నిటీ లాంటి అనుభూతులుండవు. ఎలక్షన్ల పుణ్యమా అని ఈసారి రాగింగ్ తీవ్రత కాస్త తగ్గింది. డైరెక్టుగా కులం గురించి అడగలేక ఇంటిపేరు, చుట్టాలపేర్లు అడిగి ఆయా గ్రూపుల వలల్లోకి లాగాలని ప్రయత్నిస్తున్నారు. కులం, మతం లాంటి కల్మషం అంటని లేత ప్రాయం వాళ్ళది. ఫ్రెషర్సు దాదాపు నూట ఇరవై మంది వుంటారు. గెలుపా? ఓటమా? డిసైడ్ చేసేది వీళ్ళ ఓట్లే. ఈ ఓట్ బాంక్ రాబట్టుకోవడానికి రెండు గ్రూపుల వాళ్ళు శతవిధాల ప్రయత్నిస్తున్నారు.

ఆనందమూర్తి గ్రూపుకు కన్సర్వేటివ్స్ అనే ముద్ర పడింది. సెక్రటరీ పదవికి పోటీ చేస్తున్న ఆనందమూర్తిని చూస్తుంటే వీడురా స్టూడెంటు అనిపించేలా వుంటాడు. లూజు లూజు చొక్కాలు, అంట కత్తెర, సోడాబుడ్డి కళ్ళద్దాలు, నుదిటపై సన్నటి బొట్టు. చూడగానే ఆనందమూర్తి మంచి బాలుడు అనిపిస్తుంది. ఆనందమూర్తి అంతరంగం మాత్రం అంత సౌమ్యంగా మృదువుగా వుండదు. వాళ్ళ పూర్వీకులు వైష్ణవాలయానికి చెందిన పూజారులు. తండ్రి గోవిందమూర్తి బి.ఎల్. చేసి రెండేళ్ళు హైకోర్టు అడ్వకేటుగా పని చేసి, హఠాత్తుగా ఆధ్యాత్మిక చింతన కలిగి వృత్తినీ, ఆదాయాన్నీ వదలుకొని మళ్ళీ సొంత ఊరు చేరాడు. అడ్వకేటుగా పని చేసే రోజుల్లో కాంగ్రెసు వారితో తిరిగి, కాస్తంత ఖద్దరు సంస్కృతిని కూడా వంట బట్టించుకొన్నాడు. హిందూ మత పునరుద్ధరణ సంఘానికి ఆయన జిల్లా స్థాయి కార్యదర్శి. ఆయన పెద్ద కొడుకు శ్రీమన్నారాయణమూర్తి, ఇరవై యేళ్ళ వయసులో ఇల్లు విడిచి వెళ్ళాడు. కమ్యూనిస్టుల్లో కలిసి పోయి వుంటాడని పుకారు. రెండో కొడుకు శ్రీ కృష్ణమూర్తి ఇంజనీరు. ఢిల్లీ I.I.T.లో కమ్యూనికేషన్స్‌లో ఇంజనీరు పట్టా తీసుకొన్నాడు. తన సహాధ్యాయుని కాయస్థ కులానికి చెందిన ఉత్తర దేశపు అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అంతటితో ఆ కొడుకుతో మూర్తి గారికి ఋణం తీరింది. ఇక మిగిలింది ఆనందమూర్తి. ఆనందమూర్తిని అగ్ని



## మేరీ

హోత్రంలా పెంచాడు గోవిందమూర్తి. ఏ ఇజాల వాసన సోకకుండా, వర్ణాశ్రమ ధర్మాలన్నూ వైదిక ఆచారాలనూ తు.చ. తప్పకుండా పాటించే నైష్టికుడిగా పెంచాడు. ఆనందమూర్తి అరుదుగా సినిమాలకు వెళతాడు. అదీ పాత రామారావు సినిమాలే. రేడియోలో కర్ణాటక సంగీతం మాత్రమే వింటాడు. క్రికెట్ అంటే అసహ్యం. గెట్ టు గెదర్లు, మందు పార్టీలు అంటే ముక్కు మూసుకుంటాడు. అతనికి రిజర్వేషన్లంటే పడవు. వాళ్ళతో కలిసి చదవవలసి వచ్చినందుకు చాలా కించపడతాడు. నిజానికి ఆనందమూర్తికి ఎలక్షన్ల గురించి సదభిప్రాయం లేదు. అలగాజనం సంవత్సరానికొకసారి ఆడుకొనే డర్టీ గేమ్ అని అతని విశ్వాసం. అయితే అతని ఫ్రెండ్స్ అతనికి బాగా బ్రెయిన్ వాష్ చేశారు. ''మెత్తగా వుంటే మనల్ని అథః పాతానికి తొక్కేస్తారు. మనం మిలిటెంట్లుగా

7-12-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

కె.. రిత్విక్



మారాల్సిన టైమ్ వచ్చింది. పరుశురాముడు మనకు ఆదర్శం కావాలి. మనం మూడో నేత్రం తెరవాల్సిన సమయం ఆసన్న మైంది'' అంటూ అతని చెవి దగ్గర హోరె త్తించారు. రెండు రాత్రులు తీవ్రంగా ఆలో చించి చివరకు ఒప్పుకున్నాడు ఆనందమూర్తి. అతను ఎనాటమీలో, పేథాలజీలో గోల్డు మెడ లిస్ట్. అమ్మాయిలకు అతనంటే ఎంతో గౌరవం. అతని ఇమేజ్ వాళ్ళ గ్రూపుకు క్యాష్ పాయింటు.

రాఘవరావు సామాన్యుడు కాదు. గత రెండేళ్ళుగా కాలేజీ సెక్రటరీ అతనే. ఇంటర్ చదివే రోజుల్లో అతను విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ధర్నాలు, పికెటింగ్‌లు, ఊరేగింపులు నడపటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. అతని ట్రంప్ కార్డ్ 'సెక్యులరిజం'. 'మతతత్వాన్ని ఎండ గట్టండి' అతని వినాదం. రాఘవరావుకు లోకల్ పొలిటికల్ పార్టీతో కనెక్షన్లు వున్నాయి. హార్డ్ కోర్ గుండాలకు అతను అప్పుడప్పుడూ పార్టీలు ఇస్తుంటాడు.

రోజు రోజుకీ టెన్షన్ పెరుగుతుంది. గాలి రాఘవరావు వైపుకే వీస్తున్నట్టుగా వుంది. రాఘవరావు ఉపన్యాసాలివ్వటంలో మంచి దిట్ట. శ్రీశ్రీనీ, గురజాడనీ అవలీలగా కోట్ చేస్తుంటాడు. ''కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు. తాతగారి నాన్నగారి భావాలకు దాసులు'' అలాంటి ముసలి యువకులకా మీరు ఓటు వేసేది అని విద్యార్థుల్ని నిలవేశాడు. ''ఎంచి చూడగా మంచి చెడ్డలను రెండే కులములు'' అని చెప్పి, 'మంచి' అతని కులమని డిక్లేర్ చేసుకున్నాడు. ముక్క చెక్కలవుతున్న దేశానికి 'సెక్యులరిజం' ఒకటే శరణ్యమని, దాన్ని కాపాడాలని అతని అప్పీల్. అతని ప్రచారానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆనందమూర్తి తన ప్రయత్నంలో భాగంగా వివేకానందుణ్ణీ, గాంధీని రంగంలోకి దించాడు. వివేకానందుడి సూక్తులు పాంప్లెట్స్‌గా వేసి పంచాడు. ఇదంతా ఓల్డ్ స్టాక్ అంటూ జనం పెదవి విరిచారు. పైపెచ్చు ఆనందమూర్తి మంచి వక్త కాదు. నంగిరి పింగిరి మాటలు. క్లాస్ రూమ్‌లో ఆనందమూర్తి మాట్లాడుతుంటే వెనుక నుంచి ఆవలింతలు, పిల్లకూతలు వినిపించేవి. ఎన్నికలు రెండు రోజులనగా ఆనందమూర్తి క్యాంప బాగా నీరసించిపోయారు. రాఘవరావు దాదాపు గెలిచినట్లే అనుకుంటున్నారు. అదుగో అప్పుడు దొరికిందొక ట్రంప్ కార్డ్ ఆంనదమూర్తి చేతికి. గెలుపు కిరీటాన్ని ఆనందమూర్తి నెత్తిపై పెట్టిన ఆ ట్రంప్ కార్డ్ పేరు 'మేరీ'.

కాలేజీ మెయిన్ గేటుకు ఎదురుగా, సిటీ బస్ స్టాప్‌కు కుడి వైపుగా వుంది 'మేరీ టీ స్టాల్'. తాటాకులతో కుదురుగా కట్టుకొన్న పూరి పాక అది. పేరుకు టీ స్టాలే అయినా నిజానికి అదో కళా సదస్సు. మెడికల్ కాలేజీలో ప్రాచుర్యంలో వున్న అన్ని కళలూ ప్రదర్శించబడే మినీ ఆడిటోరియం అది. అక్కడ చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ మొదలైన వారు నటించిన లేటెస్టు సినిమాలపై విమర్శనా గోష్ఠి జరుగుతుంది. అక్కడ ఏ ప్రొఫెసరుది ఏ కులం, వాడికి చెంచాగిరీ చేసే పి.జి.లదే కులం మొదలైన విషయాల సోషియలాజికల్ సర్వే జరుగుతుంది. అక్కడే సిరిసిల్లా, జగిత్యాల రైతుకూలీ పోరాటాలు, ఎన్‌కౌంటరు మరణాలు మొదలైన విషయాలపై సింపోజియం జరుగుతుంది. అక్కడే ఏ నర్సు ఎవడితో తిరుగుతుంది? ఎబార్షన్ చేయించుకున్న నర్సుల హిట్ లిస్ట్‌లు, లేటెస్ట్ ఎంట్రీలు మొదలైన స్కాండల్స్ గుప్పు మంటుంటాయి. ఇవి కాక సిటీ బస్సు స్టాప్‌లో ఎండతో, చెమటతో చిరాగ్గా వున్న యంగ్ బ్యూటీఫుల్ కాలేజీ గర్ల్స్‌ను కొత్త కొత్త టెర్మినాలజీలతో టీజ్ చేసే సదుపాయం కూడా వుంది. ఇవన్నీ కాక 'మేరీ చిలిపి శృంగార సంభాషణ' అను స్ట్రీట్ ప్లే నందు ఎవరైనా ఏ క్షణమందైనా పాల్గొనే అవకాశం కలదు. మేరీ ఎత్తుగా, నల్లగా కండలు తిరిగి దారాసింగ్ సినిమాల్లో హీరోయిన్‌లా వుంటుంది. కండలు తిరిగిన శరీరంలో పాతికేళ్ళ యవ్వనం స్పష్టంగా, వివరణకు అర్థంకాని ఆకర్షణను దేనినో ఆవిడలో పొదివింది. అక్కడకొచ్చే జనానికి ఆవిడంటే భయమూ, ఇష్టమూ కూడ. నిజానికి ఆ టీ స్టాల్ ఓనరు భీముడు లావాటి ఇనుప దూలంలా వుంటాడు. వయస్సు నలభై పైనే వుంటుంది. మేరీ అతని ప్రియురాలు. మేరీ ఎవరో ఎవరికీ తెలియదు. విద్యార్థుల్ని వేధించే మౌలికమైన సమస్యల్లో అదొకటి. మేరీ అక్కడ ఆల్ ఇన్ వన్. టీ, కాఫీలు సప్లయి చేయటం, లోపల ఇడ్లీ, దోసె, పూరి మొదలైనవి తయారు చేయడం అన్నీ ఆమే. భీముడు మాత్రం గల్లా పెట్టె దగ్గర కూర్చుని డబ్బులు వసూలు చేస్తుంటాడు. మేరీ కుర్రవాళ్ళతో చనువుగా వుంటుంది. వాళ్ళు వేసే జోకుల్ని స్పోర్టివ్‌గా తీసుకొంటుంది. మేరీ కంఠం వింటానికి కొంచెం ఇబ్బందికరంగా వుంటుంది. బాగా ఎండిన బొంగుల్ని విరగదీసినప్పుడు వచ్చే శబ్దంలా వుంటుంది ఆమె గొంతు. ఆ గొంతులో కనపడీ కనపడని మిస్చీవస్ అల్లరి వుంటుంది.ఆ అల్లరి కోసం పిల్లలు ఆ టీ స్టాల్‌కు వస్తుంటారు. ఒక అమ్మాయి చనువుగా మాట్లాడితే అదో గొప్ప ఎచీవ్‌మెంటు అనుకొని ఆనందపడే వయసు వాళ్ళది. ఆ సైకలాజికల్ రహస్యం తెలిసి వాళ్ళపై జాలితోనే, లేకపోతే గిట్టని వాళ్ళు చెప్పినట్టు బిజినెస్ కోసమో పిల్లలతో చనువుగా వుంటుంది. రెండర్థాల మాటలు సరే, జనం పలచగా వుండే టైంలో స్టూడెంట్సు మేరీ భుజంపై చెయ్యి వేయడం కూడ కద్దు. మృదువుగా చెయ్యి త్రోసివేస్తుందే తప్ప వాళ్ళను


కసురుకోదు. ఎంతమందితో చనువుగా వున్నా ఆమె శరీరానికి తెలిసిన పురుషుడు భీముడు.

మనుషుల ఇష్టాలకూ, అయిష్టాలకూ సైంటిఫిక్ రీజనింగ్ దొరకదు. మేరీకి రాఘవరావు అంటే ఇష్టం. ముఖంలో రఫ్‌నెస్, కళ్ళలో కన్నింగ్‌నెస్, మాటల్లో చురుకుదనం, పొగరు, రాఘవరావులోని ఈ లక్షణాలన్నీ ఇష్టం మేరీకి. రాఘవరావుకు అదనపు చనువు ప్రదర్శించే అవకాశాన్నిచ్చింది. ఎన్ని టీలు తాగినా, ఎంత టిఫిన్ తిన్నా రాఘవరావు దగ్గర డబ్బు తీసుకోదు. వాళ్ళిద్దరి మధ్య అలౌకికమైన అభౌతికమైన బంధం ఒకటి వర్ధిల్లుతుంది. ఆ బంధమే ఆనందమూర్తి ట్రంప్‌కార్డ్.

**"నువ్వు ఇంటి పనులు సరిగా చేయడమే లేదు. ఇంకో నౌకరును వెతుక్కుంటా"**

**"అలా చేయండమ్మ గారూ. ఇక్కడ పని కూడా ఇద్దరు నౌకర్లకు సరిపోయేంతగా వుంది" వినయంగా చెప్పాడు నౌకరు.**

**- పద్మశ్రీ (మాణిక్యారం)**



"సమతా, సెక్యులరిజం, అభ్యుదయం గురించి మాట్లాడే వాళ్ళకు మేరీతో పని ఏమిటి? నీతి, జాతి లేని బజారు స్త్రీతో కాబోయే సెక్రటరీ రాఘవరావుకు వున్న సంబంధం ఎలాంటిది? ప్రొలిటేరియన్ సంబంధమా? సోదరీ సోదర సంబంధమా? లేక ఇంకేదయినా సంబంధమా? రాఘవరావు అండ్ కో ఫానెల్ ఏర్పడిందెక్కడ? మేరీ టీ స్టాల్లో కాదా? బానర్లు రాయబడిందెక్కడ? మేరీ టీ స్టాల్లో కదా!, చేతిలో శ్రీ శ్రీ, ఒడిలో మేరీ, ఇదేనా అభ్యుదయం? చౌకబారు స్త్రీలతో సరసాలాట్టం మాత్రమే తెలిసిన సెక్రటరీ రేపు వందలాది సోదర విద్యార్థినులను ఎలా గౌరవించగలడు? ఫ్రెండ్స్ 'ఒకసారి ఆలోచించండి. కాలేజి సమస్యల్ని కాలేజీలో పరిష్కరించుకోవడమా? టీ స్టాల్లో పరిష్కరించుకోవటమా? తేల్చుకుని ఓటేయండి!"

ఏ దివ్య క్షణంలో ఆనందమూర్తి బుర్రలో ఆ ఆలోచన ఫ్లాష్ అయ్యిందోగాని, అది బ్రహ్మాస్త్రంలా పని చేసింది. ఫ్రెషర్సు ఓటు బాంకును కొల్లగొట్టాడు ఆనందమూర్తి. నూట పది ఓట్ల మెజారిటీతో నెగ్గాడు. అతని పానెల్‌లో వున్న మిగిలిన కేండిడేట్లు కూడా నెగ్గారు.

రాఘవరావుకిది ఊహించని షాక్. 'వీడెంత గడ్డిపోచలాంటివాడు' అనుకున్న ఆనందమూర్తి గెలవడం అతనికి ఊహించని షాక్. ఆ ఓటమికి, దాని ద్వారా కలిగే డిప్రెషన్‌కి అతడు సిద్ధంగా లేడు. అందుకే వేళ్ళతో సహా పెకిలించబడ్డ మర్రి చెట్టులా అయిపోయాడు. ఎన్నికల ఫలితాలు డిక్లేర్ చేసిన రాత్రంతా బార్‌లోనే గడిపాడు. అతని నర్వ్‌సెల్స్‌లోని అవమానపు మంట తగ్గేదాక వాటిని ఆల్కాహాలుతో తడిపాడు. బాధ తగ్గినాక అతని మెదడు మళ్ళీ వాస్తవంలోకి వచ్చి 'తరువాత ఏమిటి?' అనే ప్రశ్న మార్కును కళ్ళ ఎదుట వుంచింది. ఇది అతని చివరి సంవత్సరం. ఈ సంవత్సరం అతనే సెక్రటరీగా వుండి తీరాలి. ఎలా అయినా సరే అని నిర్ణయించుకున్నాడు. లోకల్ ఎం.ఎల్.ఎ.ని కలిశాడు. సంప్రదింపులు, మంతనాలు, నోట్ల కట్టలు చేతులు మారడం అయినాక, ఒక మాస్టర్ ప్లాన్ స్కెచ్ చేయబడింది. పదిమంది గూండాలు హాస్టల్‌పై దాడిచేసి ఆనందమూర్తి అతని కొలీగ్స్‌ని కిడ్‌నాప్ చేస్తారు. వాళ్ళను చితకబాది వాళ్ళచేత రాజీనామా కాగితాలపై సంతకాలు తీసుకుంటారు. అవి ప్రిన్సిపాల్‌కి ఇచ్చి రీ-ఎలక్షన్స్ ఏర్పాటు చేయించు కుంటారు. మళ్ళీ ఎన్నికలు జరిగి, రాఘవరావు నెగ్గి పదవీ స్వీకారం చేసేదాక ఆనందమూర్తి వెలుతురున్నా, లోకాన్నీ చూడడు. ఆ పది రోజులు కిడ్‌నాపింగ్‌లోనే వుంటాడు. అదీ ప్లాన్.

ఆ రాత్రి పది పదకొండు గంటల మధ్య పైన ఆకాశం హాస్పటల్ వార్డులాగ చిందరవందరగా వుంది విడివిడి మబ్బులతో. చంద్రుడేమో నిలువెల్లా తెల్లని బాండేజీలతో బెడ్‌పై పడి వున్న పేషంటులా వున్నాడు. రెండు జీపుల్లోంచి దిగారు లోకల్ గూండాలు. చెయిన్‌లు, ఇనుపరాడ్‌లు పుచ్చుకొని. ఆనందమూర్తి అతని ఫ్రెండ్స్ ఈస్ట్ బ్లాక్‌లో వుంటారు. గూండాలు సరాసరి అటువెళ్ళారు. ప్రతి రూము తలుపు తట్టడం. తెరిచిన వెంటనే ఇద్దరు గూండాలు లోనికివెళ్ళి తలుపు మూయడం. ఆ రాత్రి ఈస్ట్ బ్లాక్ అరుపులు, కేకలు, రోదనలతో శబ్ద సముద్రమయింది.

ఆనందమూర్తి రూమ్‌లోకి లావుగా రోడ్డు రోలరుగా వున్న రాబర్ట్, సన్నగా గోగు కాడలా వున్న రంగయ్య దూరారు. నున్నటి క్రాపు, గుబురు మీసాలు, పొడుచుకు వచ్చిన బొజ్జ, వేట కాంక్షతో ఎర్రబడ్డ కళ్ళు — వాళ్ళను చూడగానే వణుకు, భయం పుట్టాయి మూర్తికి. హెచ్చరిక లేని తుపానులా అతని ఒంటిపై ఎడాపెడా ఇనుప రాడ్డుతో దెబ్బలు పడ్డాయి. భయంతో బిగుసుకుపోయి, వెక్కివెక్కి ఏడ్చాడు. రెండు చేతులెత్తి 'మీకు దండం పెడతా బాబు' అంటూ వేడుకున్నాడు. స్లాటర్ హౌస్‌లో పదునైన కత్తి కింద నిలబడ్డ మేకలా వుంది ఆనందమూర్తి పరిస్థితి. మూర్తికి అదొక దుఃస్వప్నంలా వుంది. తన జీవితంలో ఇవే చివరి క్షణాలు అనుకొన్నాడు. ఈ లోకంలో ఇంత భయం, బాధ వుంటాయా? అని విస్తుబోయాడు. అతనికి తల్లి గుర్తుకొచ్చింది. చిన్నప్పుడు స్కూలు మాష్టారు కొడితే, ఆవిడ వళ్ళో పడుకొని ఏడ్చిన సంగతి గుర్తు కొచ్చింది. హైస్కూల్లో చదివే రోజుల్లో అగ్రహారంలో జరిగిన అగ్ని ప్రమాదం గుర్తుకొచ్చింది. అందరూ భయంతో పరుగెత్తడం ఆ గందరగోళంలో అతను తప్పిపోవడం గుర్తు వచ్చింది. చుట్టూ ఎగసిన మంటల్ని చూసి స్పృహ తప్పిపోవడం గుర్తుకొచ్చింది. శ్మశానంలో ఎప్పుడో చూసిన సగం కాలిన శవం. దూలం విరిగి నెత్తిపై పడి చనిపోయిన పాలేరు. పెళ్ళి ముందు రోజు ఎండ్రిన్ తాగి చనిపోయిన బంధువు అమ్మాయి, రహస్యంగా బీడీ కాల్చిన సంగతి తెలిసి తండ్రి చింతబరికతో రక్తం కారేలా కొట్టిన సంఘటన అన్నీ గుర్తుకొచ్చాయి. యముని మహిషపు లోహగంటలు మెదడులో ప్రతిధ్వనిస్తూ వుండగా, మృత్యువు తప్పనిసరి అని నిర్ధారించుకొని అయినా చివరి ప్రయత్నం అన్నట్టుగా గూండాలిద్దరూ ఆదమరిచిన క్షణంలో వాళ్ళ చేతులు విదిలించుకొని ఒక్కసారిగా కిటికీలోంచి క్రిందకు దూకాడు.

రాత్రి నల్లని రాతి పోలికలో వుంది. మామూలుగా ఎంత సందడిగా జీవనోత్సాహాన్ని వెదజల్లే కేంపస్ ఆ సమయంలో నిర్జన ప్రాంతంలో మాంత్రికుడెవరో కట్టుకొన్న చీకటి కోటలా వుంది. హాస్టలుకు, కాలేజీ మెయిన్ గేటుకు మధ్య నున్న దుబ్బుల్లోకి


పరిగెట్టాడు ఆనంద మూర్తి. అది రాత్రి కావడం వల్ల శబ్ద కాలుష్యం తగ్గి ప్రతి చిన్న శబ్దం చుట్టు పక్కలకు ప్రతిధ్వనిస్తుంది. అతని పాదాల బరువుకు విరిగిన ఎండు పుల్లలు చేసే చప్పుళ్ళు అంతటా వినిపిస్తున్నాయి. రక్త దాహపు పులుల్లా వెంటాడుతున్నారు గూండాలు. ఒక ఫుల్ బాటిల్ నాటుసారా జేబులోని పచ్చనోట్లు వాళ్ళలోని హ్యూమన్ ఎలిమెంటును చంపివేసి రాక్షసులుగా చేశాయి. వాళ్ళు ఆ క్షణంలో కుల, మతాలకు అతీతంగా ఎదిగిపోయారు. డేవిడ్, రంగయ్యలది హిందూ మతం కాదు. క్రిష్టియానిటీ కాదు. నర హంతకుల కులం.

ఆనందమూర్తి దుబ్బులను దాటి కాంపౌండ్ వాల్ దగ్గరకు వచ్చాడు. మామూలుగా అంత ఎత్తున్న గోడను ఎక్కటము ఆనందమూర్తికి సాధ్యంకాని పని. ప్రాణ భయంతో ఆ గోడను అవలీలగా ఎక్కి ఫక్కనున్న రోడ్‌పైకి దూకాడు. బయట నిర్మానుష్యమైన రోడ్డు. ట్యూబ్‌లైట్ దుప్పటిలో గాఢంగా నిద్రిస్తున్న రోడ్డు. ఆ రోడ్డుపై ఎంత దూరమని పరిగెట్టగలడు. ఇక దొరికిపోయామురా దేవుడా. అనుకున్నాడు ఆనందమూర్తి. అప్పుడు కనిపించింది చావు పుట్టుకల మధ్య సన్నని ఆశలాగ 'మేరీ టీ స్టాల్' అది కాపాడే దేవాలయంలా తోచి పరుగున అక్కడకు చేరి 'మేరీ! మేరీ!' అంటూ పెద్దగా అరిచేడు.

గాఢ నిద్రలోంచి ఉలిక్కిపడి లేచింది మేరీ. లేచి చుట్టూ పరికించి చూసింది. చికటి మినుక్కు మినుక్కు మంటున్న సన్నటి దీపం. మళ్ళీ వినిపించింది. 'మేరీ' అంటూ. అది భీముడి గొంతు కాదు. భీముడు స్నేహితుడి పెళ్ళి అని మద్రాసు వెళ్ళాడు. ఎవరై వుంటారు ఇంత రాత్రివేళ. పరిచితమైన గొంతులానే వుంది. ఆ గొంతులో భయం వుంది.

సన్నని ఏడుపు జీర వుంది. లాంతరు వత్తిని పైకెత్తి బయటకు తేరిపార చూస్తే బయట మసకమసకలా మనిషి ఆకారం. సన్నని తీగతో చుట్టిన తడిక గేటు వాళ్ళది. గేటు తీస్తే ఆనందమూర్తి. తుపాకీ గుండు దెబ్బతిన్న పిచ్చుకలాగ వణికి పోతున్నాడు. ''ఏందయ్యా! ఏమైంది? రా! లోపలికి'' అంటూ పిలిచింది. లోపలకు రావడం తోటే ''నన్నెక్కడైనా దాచెయ్యి మేరీ! ఎక్కడైనా దాచెయ్యి. వాళ్ళు వస్తున్నారు. నీకు దండంపెడతా దాచెయి మేరీ! నన్ను చంపేస్తారు వాళ్ళు! ప్లీజ్ మేరీ!''చేతులెత్తి దండం పెడుతున్న ఆనందమూర్తిని చూసి విస్తుపోయింది మేరీ. ఎవరు? ఏమిటి? అని అడిగినా చెప్పే స్థితిలో లేడా మనిషి. మృత్యు భయంతో గడ్డకట్టి వున్నాడతను. సమాధానం దొరకని ప్రశ్నలను లోపలే దాచుకొని అతన్ని వెనక స్టోర్ రూమ్‌లో దాచింది. బయట తడిక మూసి చిత్ర విచిత్రమైన ఆలోచనలతో పక్కపై కూలబడింది మేరీ.

రంగయ్య, డేవిడ్‌లు అతి కష్టం మీద కాంపౌండ్ వాల్‌దాటి రోడ్డుపైకి వచ్చారు. రోడ్డు గాఢ నిద్రలో వుంది. 'తప్పించుకు పోయాడురా లక్ష్మి కొడుకు' అనుకుంటూ విసుగ్గా వెనక్కు తిరోగమించే లోపల 'హోటల్లో దూరినాడండి' అంటూ క్లూ ఇచ్చాడు బన్



''అమ్మా ఐస్‌క్రీం కొనవే?'' అడిగాడు గోపి మారాం చేస్తూ.

''తప్పు నాన్నా! చలికాలంలో ఐస్‌క్రీం తినకూడదు'' చెప్పింది తల్లి.

''ఫర్వాలేదులే. ఎండలో విప్పుని తింటాము. వెచ్చగా వుంటుంది'' తక్కువ అన్నాడు గోపి. – పద్మశ్రీ (శ్రీకాకుళం)

షెల్టరులో పడుకొన్న ముష్టివాడొకడు. అదుగో అప్పుడు మొదలైంది గొప్ప శృంగార, భీభత్స, భయానక రసభరితమైన సంఘటన.

'ఎవురది. ఎవురంటే మాట్లాడరేం' తలుపు దగ్గర అలికిడిని విని అరిచింది మేరీ. ఆమె అరుపులకు బదులుగా పెళ్ళుమనే శబ్దం. విరిగిన తడిక వెనక్కు కూలడం. కూలిన తడికను తొక్కుకుంటూ రెండు భయం కొలిపే ఆకారాలు లోపలకు రావడం చూసింది. ''ఎక్కడ, ఎక్కడ దాచావు? రమ్మను దెబ్బతో సఫా అయి పోవాల'' పెద్దగా అరిచాడు డేవిడ్. ''ఎవురు రాలేదయ్యా! ఇంత రాత్రివేళ ఎవురొస్తారు? మీకు దండం పెడతా! అల్లరి చెయ్యకుండా ఎల్లిపొండి. ఇంట్లో మగాయన కూడా లేడు. దయచేసి ఎల్లిపోండయ్యా'' దీనంగా అడిగింది మేరీ. ''మొగుడింట్లో లేడా? మరింకేం. మజా చేసుకుందామని లోపల దాచుకుంటావు? రమ్మనవే బయటకు! వేషాలేస్తే కీళ్ళు విరిచేస్తాను. రమ్మను నీ రంకు మొగుణ్ణి'' ఈసారి డేవిడే అరిచాడు.

మేరీ క్షణం నిశ్శబ్దంగా అయిపోయింది. గట్టి నిర్ణయానికి వచ్చిన దానిలా లోపలికి వెళ్ళింది. పెట్టె అడుగునున్న డబ్బు మూట తీసుకొని బయటకు వచ్చింది. ''ఆయన్ని వదిలేయండి! నోట్లో నాలుకలేని ఎర్రిబాగులోడు. ఇప్పటికే సగం చచ్చాడు. ఈసారి మీ చేతికి దొరికితే హరీ అంటాడు. ఇదుగో వెయ్యి రూపాయిలు. నా కష్టార్జితం. ఇటు తీసుకొని ఆయన్ని వదిలేయండి'' అంటూ వంద రూపాయిల నోట్లను వాళ్ళ చేతుల్లో పెట్టింది.

దీపం వెలుగులో వంద నోట్లు రెపరెప లాడుతున్నాయి. డేవిడ్ రంగయ్యల కళ్ళలో భగ్గుమన్న ఆశ. నోట్లను చెరి సగం పంచుకున్నారు. వాళ్ళలోని కసి, పట్టుదల తగ్గాయి. అక్కడే బెంచీపై కూలబడి ''కాసిని మంచినీళ్ళు తెచ్చి పెట్టవే'' అని ఆర్డర్ వేశారు.

రచయితలు, నాయకులు మానవత్వం, దయ ఎక్స్‌ట్రా విషయాల గురించి ఊకదంపుడు మాటలు చెబుతారు. నిజానికి ఇది వ్యాపార ప్రపంచం. ఇక్కడ వ్యాల్యూథీరీ మాత్రమే పని చేస్తుంది. ప్రతి దానికీ వెల. ఆకలి తీరడానికి ఐదు రూపాయిలు. వ్యాధి నయం చేసేందుకు యాభై రూపాయిలు. ఫైళ్ళు కదలాలంటే వంద రూపాయిలు. పెళ్ళిళ్ళు కావాలంటే వేల కొద్ది రూపాయిలు. ప్రతి దానికి వెల, రేటు వున్నాయి. ఒక హంతకుడి దయకు వెల ఎంత? మేరీ చేస్తున్నది వ్యాపారమే అయినా వ్యాపార సూత్రాల్ని సరిగ్గా వంట బట్టించుకోలేదు. డేవిడ్, రంగయ్యల దయకు చాలా తక్కువ వెల కట్టింది. వెయ్యి రూపాయిల ఆహారం మానవ మృగాలకు సరిపోలేదు. యవ్వన శోభ ప్రవహించే స్త్రీ, ఆహారంగా కావాల్సి వచ్చింది. మేరీ ప్రతిఘటించలేదు. అర్ధగంట తరువాత మీసాలు దువ్వుకుంటూ మెరిసే కళ్ళతో వెళ్ళిపోయారు వాళ్ళు. ఆనంద మూర్తి బతికిపోయాడు.

తన ఎన్నికల పోరాటంలో ఓట్లకోసం మేరీని పతితను చేశాడు ఆనందమూర్తి. ఒక ప్రాణం కాపాట్టంకోసం పతిత అయ్యింది మేరీ. మెడికల్ విద్యార్థుల్ని వేధించే మౌలిక సమస్యలో ఒకటి మేరి పతిత అవునా? కాదా? అని మరి ఆనందమూర్తి ఏమంటాడో? ●